క్లుప్తంగా

అగ్నిపథ్ దరఖాస్తు ప్రక్రియలో సవరణలు

పుట్టపర్తి అర్బన్: భారత పదాతి దళంలో వివిధ ర్యాంకుల అధికారుల భర్తీకి సంబంధించి జారీ చేసిన నోటిఫికేషన్‌లో సవరణలు చేస్తూ తాజా నోటిఫికేషన్‌ను ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. joinindianarmy. nic.in వెబ్‌సైట్‌లో మార్చి 15 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు 10వ తరగతి ఉత్తీర్ణులైన పాసై ఉండాలి. అభ్యర్థులకు కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నారు. మూడు దశల్లో రిక్రూట్‌మెంట్ నిర్వహించబడుతుంది. పరీక్ష ప్రారంభానికి 10 రోజుల ముందే అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంటాయి. సందేహాల నివృత్తికి 79961 57222లో సంప్రదించవచ్చు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ నాగరాజు సోమవారం ఎస్‌ఐ లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించారు. విద్యుత్, ఫ్యాన్లు, తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యాలపై ఆరాతీశారు.

దివ్యాంగుల పరికరాల పంపిణీ

కనగానపల్లి: స్థానిక భవిత విద్యా కేంద్రం విద్యార్థులకు అధికారులు దివ్యాంగుల పరికరాలు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఎంఈఓ అరుణమ్మ వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు అందజేశారు. సహిత ఉపాధ్యాయులు జగదీశ్వర్, లలితమ్మ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ

చెన్నేకొత్తపల్లి: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ నాయక్, ఎంపీపీ అంజలి, సింగిల్ విండో అధ్యక్షులు డోలారామ చంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ హరికుమార్, ఎంపీటీసీ పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు భాగవత ప్రవచనాలు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తిలోని చిత్రావతి నది హారతిఘాట్ వద్ద మంగళవారం సాయంత్రం 6 గంటలకు సంక్షిప్త భాగవత ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్రపతి అవార్డు గ్రహీత కొండపాక రంగాచార్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పుట్టపర్తి పుణ్యక్షేత్రంలో 99వ భాగవత సప్తాహములు బోధిస్తున్నట్లు తెలిపారు.

చౌక దుకాణ డీలర్ మృతి



అప్పిరెడ్డి నాగిరెడ్డి (ఫైల్)

గాండ్లపెంట: కొట్లపల్లి చౌక దుకాణపు డీలర్ అప్పిరెడ్డి నాగిరెడ్డి (63) సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు.. వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు అప్పిరెడ్డి వెంకటరమణారెడ్డికి సోదరుడు. మృతుడికి భార్య పార్వతమ్మ, కుమారుడు శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

పరామర్శ

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ 19వ వార్డు ప్రశాంతి గ్రాంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఓబుళరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సోమవారం ఆయన నివాసం వద్దకు వెళ్లి పరామర్శించారు. అలాగే ప్రశాంతి గ్రాం వద్ద బీడుపల్లి ఆదినారాయణరెడ్డి నిర్మించిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు సకాలంలో అందించాలి

ధర్మవరం అర్బన్: స్టోర్ డీలర్లు నిత్యావసర సరుకులను సకాలంలో అందించాలని ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం స్టోర్ డీలర్లు, ఎండీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ధర్మవరం డివిజన్ ఏఎస్‌ఓగా లక్ష్మీదేవికి బాధ్యతలను అప్పగించారు. స్టోర్ డీలర్ల సంఘం నాయకుడు పరంధామరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కనగానపల్లి: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో దాతల సహకారంతో విద్యార్థులకు క్రీడా సామగ్రి సోమవారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లాయర్ నల్లప్ప, అంకె అశోక్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ ప్రభాకర్, పాఠశాల కమిటీ చైర్మన్ విశ్వనాథ్, హెచ్ఎం లక్ష్మీదేవి, పీడీ రమేష్ తదితరులున్నారు.

యువకునికి తీవ్రగాయాలు

కదిరి అర్బన్: ఎగువపల్లిలో సోమవారం విద్యుత్ షాక్‌కు గురై సున్నపుగుట్టతండాకు చెందిన యువకుడు రహంతుల్లానాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తీసుకెళ్లారు.

భక్తుల కొంగు బంగారం

యర్రదొడ్డి గంగమ్మ



- రూ. 1.25 కోట్లతో ఆలయ పునర్‌నిర్మాణ పనులు
- దేవదాయ శాఖ అధీనంలోకి రావడంతో వేగంగా అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



వరద ఉధృతికి కొట్టుకుపోతున్న గంగమ్మ ఆలయం (ఫైల్)



తాత్కాలికంగా నిర్మించిన ఆలయం

కదిరి అర్బన్: భక్తుల కొంగు బంగారంగా యర్రదొడ్డి గంగమ్మ ఆలయం విరాజిల్లుతోంది. కదిరి మండల పరిధిలోని యర్రదొడ్డి వద్ద వెలసిన గంగమ్మను దర్శించుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పోటెత్తున్నారు. తమ మొక్కులను తీర్చే అమ్మవారి ఆలయం పునర్నిర్మాణానికి నోచుకోవడం అదృష్టంగా భావిస్తున్నారు భక్తులు. 2021 అక్టోబర్ 10న వర్షాలు, తుఫానుల కారణంగా మద్దిలేరు వాగు పోటెత్తింది. వరద ఉధృతికి ఆలయ నిర్మాణాలన్నీ కొట్టుకుపోయాయి. ఈ ఆలయాన్ని స్థానిక శాసన సభ్యులు డాక్టర్‌పీవీ సిద్దారెడ్డి కృషితో 2020 ఆగస్టు 20న దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో దేవదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) రూ. కోటి నిధులు మంజూరు చేసింది. ఈ నిధులకు తోడు ఆలయ నిధులు రూ. 25 లక్షలతో నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ సదుపాయం, భక్తులకు 20 టాయిలెట్లు, దాతల సహకారంతో అద్దె గదులు ఏర్పాటు చేశారు. మొక్కులు తీర్చుకునేందుకు జంతుబలి ఇచ్చిన తర్వాత వాటిని డ్రెస్సింగ్ చేసుకునే సదుపాయం కల్పించారు. త్వరలోనే ఆలయ పునర్‌నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నారు.

రూ. కోటి మంజూరు చేశారు



ఆలయ పునర్ నిర్మాణానికి దేవదాయ శాఖ కామన్ గుడ్‌ఫండ్ కింద రూ. కోటి మంజూరు చేసింది. ఈ నిధులకు 20 శాతం ఆలయం తరఫున కట్టాలి. రూ. 25 లక్షలు కట్టగా.. మొత్తం రూ. కోటి 25 లక్షలతో ఆలయ పునర్ నిర్మాణానికి టెండర్ దశలో ఉంది. త్వరలోనే ఆలయం, ఆలయం ప్రాంగణంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం. ఎండోమెంట్ పరిధిలోకి రావడంతో ఆలయం అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం రూ. 31 లక్షలు బ్యాంక్ బ్యాలెన్స్‌కూడా ఉంది.

\- ఈఓ రామాంజినేయులు

మహిమ గల తల్లి



యర్రదొడ్డి గంగమ్మ మహిమగల తల్లి. ఆలయం పునర్ నిర్మాణం చేయడం మాకు చాలా సంతోషంగా ఉంది. దేవదాయశాఖ పరిధిలోకి రావడంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. గంగమ్మను మొక్కుకుంటే తప్పకుండా కోర్కెలను అమ్మవారు తీరుస్తారు.

\- రాజారెడ్డి, భక్తుడు, చిప్పలమడుగు

సామాజిక తనిఖీ

కనగానపల్లి: మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు జరిగిన జాతీయ ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక ఏపీఓ కార్యాలయం నుంచి సామాజిక తనిఖీ బృందం సభ్యులకు రికార్డులు అందించినట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన సుమారు రూ.17.5 కోట్ల ఉపాధి హామీ పనులపై వారం రోజులు పాటు ఈ బృందం సామాజిక తనిఖీ ఉంటుందన్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాల పంపిణీ

గాండ్లపెంట: వేసవిలో గ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 75 శాతం సబ్సిడీపై పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి కేశవనాయక్ సోమవారం తెలిపారు. గాండ్లపెంట, రెక్కమాను రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. 5 కిలోలు రూ.115 కాగా, సబ్సిడీ పోనూ రూ. 28.75 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పథకాలు అర్హులందరికీ అందాలి

అమడగూరు: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ కవిత పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కారం చూపాలని అధికారులకు తెలిపారు. సచివాలయ, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ క్లినిక్ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎంపీడీఓ నసీమా, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న సోమశేఖరరెడ్డి

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పెడపల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, బత్తలపల్లి, తండా పాఠశాలల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రారెడ్డి, ఉపధ్యాయులు చెన్నక్రిష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కదిరి అర్బన్: స్థానిక కోర్టు ప్రాంగణంలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, పట్టణాధ్యక్షుడు బాహుద్దీన్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పిచ్చల శశికాంత్, గురులింగ స్వామి, శివశంకర్‌రెడ్డి, కొమ్మెద్ది అప్పల్ల, జిలాన్, బషీర్, సోషల్ మీడియా నాయకులు ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ రీజినల్ స్థాయి క్విజ్ పోటీలు



ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులతో ఆర్డీటీ సిబ్బంది

బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో సోమవారం రీజినల్ స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. 10 మండలాలకు చెందిన 10 టీములు మొత్తం 40 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కొత్తచెరువు ఏరియా నుంచి 132 మార్కులతో ప్రథమ స్థానం, 111 మార్కులతో ముదిగుబ్బ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరికి రీజినల్ డైరెక్టర్ ప్రమీల చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ రెండు టీములు మార్చి 11న అనంతపురంలో జరగనున్న సెంట్రల్‌స్థాయి క్విజ్ ఫెస్టివల్‌కు అర్హత సాధించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ ఎస్టీఎల్‌లు రామకృష్ణ, పూజిత, రెడ్డెప్ప, నాగభూషణం, ఏటీఎల్ రుక్మాంగద, సంఘం ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు హాజరయ్యారు.

పుట్టపర్తిలో పందులు సంచరిస్తే కఠిన చర్యలు

పుట్టపర్తి టౌన్: పట్టణంలో పందులు సంచరిస్తే కఠిన చర్యలు తప్పవని శానిటేషన్ అధికారి సోమశేఖర్ పందుల యజమానులను హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం కర్ణాటకనాగేపల్లి, హారతీఘాట్, చిత్రావతి బ్రిడ్జి ఏరియాలో ఉన్న పందులు యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో సత్యసాయి మహాసమాధి దర్శనార్థం దేశ విదేశాల నుంచి భక్తులు అధిసంఖ్యలో వస్తుంటారన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పందుల సంచారంతో పట్టణ ప్రజలకు, భక్తులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. పందులు సంచరిస్తే సుదూర ప్రాంతాలకు తరలిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీ మోహన్ తదితరులున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బత్తలపల్లి: ఆపదలో ఉన్న వ్యక్తులకు రక్తదానం చేస్తే వారికి ప్రాణదానంతో సమానమని హజరత్ హిమామ్ ఖాశీం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ఖాశీంస్వామి చిన్న గంధం ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం బత్తలపల్లిలోని ఖాశీంస్వామి పీర్ల చావడి వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్డీటీ బ్లడ్‌బ్యాంకు బృందం కిశోర్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది రక్తదానం చేశారు. అనంతరం అంబులెన్స్ సర్వీసును ప్రారంభించారు. రాత్రి 8 గంటలకు వంద మంది ఫకీర్‌లతో బీజాపూర్, కంప్లీ డ్రమ్స్ షా బన్వాష జలాల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్కంపూటి సత్యనారాయణ, వెంకటేశ్వరచౌదరి, ట్రస్ట్ చైర్మన్ ముక్తుమ్ ఖాశీం, ట్రస్ట్ సభ్యులు, ఆర్డీటీ బ్లడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు



ధర్మవరం: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన పురుషోత్తం రాయల్ సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పూలమాలతో సత్కరించి స్వీట్లు తినిపించారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి



చైర్మన్ కోటి బాబు ఇంట్లో సమావేశమైన మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీ తదితరులు

తనకల్లు: రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చీకటిమానిపల్లి సమీపంలోని మదరసా వద్ద సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున విచ్చేసి జిల్లాలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, నాయకులు గణేష్‌రెడ్డి, చిదానందరెడ్డి, బాబాఫక్రుద్దీన్, రహంతుల్లా, ఆనందరెడ్డి, బాల్‌రెడ్డి, వాల్మీకి సుధాకర్, పవన్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లిలో...

బత్తలపల్లి: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బత్తలపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయ కన్వీనర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మంత్రికి దుశ్శాలువాలు కప్పి పూల మాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. మధ్యాహ్నం చిత్తూరు జిల్లాకు వెళ్లూ బత్తలపల్లిలోని కోటి సూర్యప్రకాష్‌బాబు స్వగృహానికి చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, కదిరి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులతో మంత్రి చేరుకున్నారు. గృహ ప్రవేశ సమయంలో సమయం కుదరక రాలేకపోయారని, ఇప్పుడు తేనీటి విందుకు హాజరైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కోటి సూర్య ప్రకాష్‌బాబుతో పాటు ఆయన సతీమణి జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డెర్లకు పెద్దపీట వేయడం గర్వకారణం

కొత్తచెరువు: వడ్డెర్ల సంక్షేమానికి పెద్దపీట వేసి రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించడం గర్వకారణమని ఓసీసీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డెర్లు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపుతో రాజకీయ భవిష్యత్తుకు నాందిపలికినట్లయిందన్నారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేలా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆయన కోరారు.

ఇళ్లు లేని పేదలను గుర్తించండి

కనగానపల్లి: గ్రామాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో మూడోవిడత కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ సిబ్బందితో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఏఈ చిరంజీవి మాట్లాడుతూ మండలంలో మొదటి,రెండు విడతల కింద మంజూరైన 4 వేలు ఇళ్లు నిర్మాణ దశలో ఉండగా, ప్రస్తుతం మూడో విడత కింద 1,700 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటున్నామన్నారు.

వడ్డెర్ల ఎదుగుదలను ఓర్వలేకపోతున్న 'పల్లె'



మాట్లాడుతున్న వడ్డెర సంఘం నేతలు

పుట్టపర్తి: వడ్డెర్లు రాజకీయంగా ఎదుగుతుండడాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఓర్వలేకపోతున్నారని టీడీపీకి చెందిన పలువురు వడ్డెర నాయకులు విమర్శించారు. బుక్కపట్నం మండలం రామసాగరం గ్రామానికి చెందిన ఆదినారాయణ, కొత్తచెరువు పెద్దన్న తదితరులు బుక్కపట్నంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం తమ సంఘం నేత, డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో వడ్డెర్ల సమావేశం నిర్వహించడాన్ని పల్లె రఘునాథరెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. వడ్డెర్లు రాజకీయంగా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నారని, తమ ఎదుగుదలను చూసి పల్లె ఓర్వలేక తానే వడ్డెర్ల సమావేశానికి ఆర్థిక సాయం అందించినట్లు చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. తమ సంఘం నేతలే ఆర్థిక సాయం అందించి సమావేశం విజయవంతం చేశారని వారు స్పష్టం చేశారు. తమ కులానికి చెందిన వ్యక్తులు రాజకీయంగా బలపడకూడదనే దుర్బుద్ధితో పల్లె ముందుకు సాగుతున్నారని ఆరోపించారు. ప్రతి ఎన్నికలో టీడీపీ విజయం కోసం కృషి చేశామని తెలిపారు. ఇప్పటికైనా కుళ్లు, నీచ రాజకీయాలు మానుకోకుంటే, వచ్చే ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ నాయకుల చొరవతో రూ.లక్ష పరిహారం

నల్లమాడ: వైఎస్సార్ సీపీ నాయకుల చొరవతో మృతుని కుటుంబానికి రూ.లక్ష పరిహారం అందింది. వివరాలు.. మండలంలోని మసకవంకపల్లికి చెందిన అంజి (30) ఆరు నెలల క్రితం ఐచర్ వాహన డ్రైవర్‌గా కర్నూలుకు వెళ్లాడు. అక్కడ అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఎస్. రాంమోహన్‌రెడ్డి మరికొందరు అప్పట్లో వాహన యజమానితో మాట్లాడి మృతుని కుటుంబానికి రూ.లక్ష పరిహారం ఇచ్చేలా ఒప్పించారు. ఈ మేరకు సోమవారం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మృతుని భార్య శ్వేతకు ఆ మొత్తం అందజేశారు. ఇదివరకే వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం రూ. లక్ష అందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గాండ్లపెంట:మండల పరిధిలోని పెద్దతండా పంచాయతీ కేంద్రంలో రూ.6 లక్షలతో 200 మీటర్ల సీసీ రోడ్డు పనులకు సోమవారం గ్రామ సర్పంచ్ బుక్యా శాంతమ్మ భూమి పూజ చేసి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సీసీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డిని కోరగా వెంటనే స్పందించి మంజూరు చేయించారన్నారు. ఉప సర్పంచ్ సరోజమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి తదితరులున్నారు.

నేడు ఎంపీపీగా వెంగళరెడ్డి బాధ్యతల స్వీకరణ

బత్తలపల్లి: ఎంపీపీగా గజ్జెల వెంగళరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. బత్తలపల్లి ఎంపీపీ గుర్రం వనజ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నూతన అధ్యక్షులు ఎన్నికయ్యేవరకు వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి అధ్యక్షులుగా కొనసాగనున్నారు.

సంక్షిప్త సమాచారం

ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

పుట్టపర్తి టౌన్: 6వ వార్డు వివేకానంద రోడ్డులో నివసిస్తున్న సప్లయర్స్ సత్యం ఇంట్లో సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దాదాపు రూ. 2 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్ చెరువుభాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు రమేష్ తదితరులు బాధితులను పరామర్శించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఓడీ చెరువు: ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ పోలప్ప అన్నారు. ఆకుతోటపల్లి జగనన్న లేఅవుట్‌ను సోమవారం హౌసింగ్ ఏఈ హరిప్రసాద్‌తో కలసి పరిశీలించారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

ఎన్పీకుంట: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖాధికారి గోపాల్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. ఎస్ఓ రూపారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ముదిగుబ్బ: ముదిగుబ్బ ఎస్సీ కాలనీవాసులకు శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలంటూ సోమవారం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆటో పెద్దన్న, వారాదప్ప, ఆదినారాయణ తదితరులు మాట్లాడుతూ స్థలం చూపడంతో పాటు ప్రహరీ గోడ, బోరు ఏర్పాటు చేయించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండండి

ఓడీ చెరువు: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గోపి అన్నారు. మండలంలోని వంచిరెడ్డిపల్లిలో సోమవారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు. పోలీసు సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నల్లచెరువు: అల్లుగుండు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సూరి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కదిరికి చెందిన సూరి తన ద్విచక్ర వాహనంలో నల్లచెరువు నుంచి పట్టణానికి బయలుదేరాడు. గ్రామం దగ్గరలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. ప్రమాదంలో సూరికి కాలు విరిగింది. మరో బైక్‌లో ఉన్న వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. సూరిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రశాంతంగా జీవించాలి

అమడగూరు: గొడవలకు స్వస్తి పలికి ప్రశాంత జీవితాన్ని గడపాలని సీఐ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఆయన చీకిరేవులపల్లి గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటనారాయణ, జమేదారు సుధాకర్, భాస్కర్, చంద్రహాస్, పాల్గొన్నారు.

మామిడి, టేకు చెట్లు దగ్ధం

అమడగూరు: లోతువంక నారవలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రైతులు ఆంజినేయులు, రాజన్న, వెంకటరమణల సుమారు 80 మామిడిచెట్లు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక శాఖ వారికి ఫోన్ చేయడంతో సకాలంలో స్పందించి మంటలను ఆర్పారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అమడగూరు: వాహనదారులంతా తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన రెవెన్యూ కార్యాలయ సమీపంలో బిళ్లూరు రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. పలువురు వాహన దారులకు జరిమానా విధించారు.